# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## కాంగ్రెస్ పాలనే దరిద్రం

**నమ్మితే మళ్లీ పాత రోజులే**

- 24గంటలు కరెంట్ తీసేస్తరు.. మూడు గంటలే ఇస్తరు
- అది ఎప్పడిస్తరో తెల్వదు
- 10 హెచ్‌పీ మోటర్లతో బతుకులు ఆగమే
- మోటర్లకు మీటర్లు పెడుతరు.. నిండా ముంచుతరు
- ఈ ఎన్నికల్లో ఆ పార్టీని తరిమికొడుతం
- కరెంటిచ్చిన కేసీఆర్‌కే మద్దతిస్తం
- స్పష్టం చేసిన జిల్లా రైతులు

పెద్దపల్లి, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్‌ను నమ్మితే పదేండ్ల కిందటి పరిస్థితులు పునరావృతం అవుతాయని జిల్లా రైతులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ వచ్చేదాక ఎసోంటి గోస పడ్డమో.. ఎన్ని కష్టాలు పడ్డమో ఆ భగవతునికే తెలుసని వాపోతున్నారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చేది లేదు.. సచ్చేది లేదు గానీ, అన్నదాతలను ముంచే కుట్రలు చేస్తున్నారని మండిపడుతున్నారు. కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలు అని చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. 24 గంటల కరెంట్ ఉన్న కాడ ఈ మాయమాటలేందని నిలదీస్తున్నారు. పైగా 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని ఉచిత సలహా ఇవ్వడంపై ఆగ్రహిస్తున్నారు. రెండు రోజుల క్రితమే ఆ పార్టీ అసలు రంగు బయటపడిందని, కేంద్రం మంత్రి నిర్మలా సీతారమన్ మాటలతో కాంగ్రెస్ మోటర్లకు మీటర్ల పెట్టే కుట్ర బట్టబయలైందని మండిపడుతున్నారు. వాళ్లను నమ్మితే మోటర్లకు మీటర్లు పెడుతరని, 24 గంటల కరెంట్ తీసేసి 3 గంటల ఇస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. నాడు వాళ్ల పాలనలో అరిగోస పడ్డామని, కరెంట్ ఎప్పుడొస్తుందో తెలియక రాత్రిళ్లు జాగారం చేశామని, కండ్ల ముందే పంటలు ఎండుతుంటే కన్నీళ్లు పెట్టుకున్నామని గుర్తు చేశారు. దొంగ రాత్రి కరెంట్ ఇచ్చి ఎందరో రైతుల ఉసురు పోసుకున్న ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు. కరెంట్ విషయంలో ఇటు బీజేపీ కూడా తెలంగాణ రైతులకు అన్యాయం చేసిందని ఆక్షేపిస్తున్నారు. కేసీఆర్ లేకుంటే తమ మోటర్లకు మీటర్లు పెట్టి బిల్లులు వసూలు చేసేవారని, కానీ, తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకు మోటర్లకు మీటర్లు పెట్టనివ్వని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ఈ నెల 30న కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను మరోసారి సీఎంగా చేసుకుంటామని స్పష్టం చేస్తున్నారు.



### రేవంత్‌రెడ్డివి సోయి తప్పిన మాటలు..

తెలంగాణ అచ్చినంక బాధలు లేకుండా ఉన్న భూమి దున్నుకొని బతుకుతున్నం. 24 గంటల కరెంట్ అత్తుండడంతో రెండు పంటలు పండించుకుంటున్నం. కానీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ ఇస్తే రైతులకు సరిపోతుందని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొమ్మని సోయి తప్పి మాట్లాడుతుండు. ఆయనకు ఎం తెలుసని అడ్డం పొడుగు నరుకుతుండు. భూములమ్ముకునేటోనికి ఎవుసం గురించి ఎరుకనుకోవడం మన బుద్ధి తప్పు. అయినా పాలిచ్చే బర్రెను అమ్ముకొని కష్టాలు పడుతామ. మంచి జేత్తున్న సీఎం కేసీఆర్ దిక్కే ఉంటం. ఇంకెన్నిసార్లయినా కారు పార్టీకే ఓటేస్తం.

-బీ.జూపాక సురేందర్, రాంపల్లి (పెద్దపల్లి)



### ఇంటికి బాయి కాయిడికి తిరుగుడైతుండే..

నేను చిన్నతనం సంది ఎవుసం జేత్తున్న. కాంగ్రెస్ రాజ్యంల ఎప్పుడు కరెంటు అత్తందో ఎప్పుడు పోతుందో తెలవకపోయ్యేది. గడియగడియకు ఇంటికి బాయికాడికి తిరుడైతుండే. నడిజాం రాత్రి కరెంటుతో ఆరిగోస పడ్డం. ఇప్పుడు 24 గంటల కరెంటుతో సంబురంగా ఎవుసం చేస్తున్న. ఎప్పుడుపడితే అప్పుడు స్టార్టర్ ఒత్తుతే మోటరు నుంచి నీళ్లు అత్తున్నయ్. కరెంటు కష్టాలు తీర్చింది కేసీఆరే.. ఇప్పటోళ్లకు ఆప్పటి కరెంట్ కష్టాలు తెలవదు. కాంగ్రెస్ నాయకులు చెప్పే 3 గంటలకు మూల కూడా పారదు. బోర్లైతే ఇరాం లేకుండా పోస్తున్నయ్. పంటలు మంచిగా పండుతున్నయ్. అప్పటి కరెంటు కరెంటు కష్టాలు ఇప్పుడుంటే ఎవుసం బంద్‌పెట్టి ఎక్కడనో జీతం ఉండేది.

- నలవేని ఎల్లయ్య, రైతు, శాంతినగర్, (పెద్దపల్లి

### ఎవుసం తెల్వనోడే 10 హెచ్‌పీ మోటర్లంటడు



మాకు ఊరిలో నాలుగు ఎకరాల భూమి ఉన్నది. ఇప్పుడు బోరుబాయిల 5హెచ్‌పీ మోటర్ పెట్టి పొలానికి నీళ్లు పారించుకుంటున్నం. కరెంట్ గూడా మంచిగా వత్తున్నది. ఎప్పుడు సాటర్ నొక్కితే అప్పుడు పంపులు పొత్తున్నయ్. కానీ మొన్న టీవీల కాంగ్రెసాయన రైతులను 10 హెచ్‌పీ మోటర్లు కొనుక్కొమంటున్నడు. ఇది జూత్తె నవ్వచ్చింది. ఆయనకు ఎవుసం గురించి, రైతుల బాధలు తెల్వదని అర్థమైంది. ఎమన్న బుర్ర ఉన్నదా..? అనిపించింది. పెద్ద మోటర్లు పెట్టుకోవాలంటే నానా కథలు పడాల్సి వత్తది. పైపులు మార్చాలి. ట్రాన్స్‌ఫార్మర్ కొత్తది ఏయ్యేలా. అరువై డెబ్బై వేలు పెట్టి మోటరు తేవాలె. ఇది అయ్యే పనేనా? అందుకే చెబుతున్న మా గోస తెలిసిన బీఆర్ఎస్ సర్కారుకే అండగా నిలబడతం.

- మాదాసు రాజేశ్వరి, మహిళా రైతు (పాలకుర్తి)



### వాళ్లద్దు..వాళ్ల రాజ్యమద్దు..

మన రాష్ట్రం రాక ముందు కరెంట్ కోసం మత్తు గోసెల్లదీసినం. నాటేసిన కాడి నుంచి కంటిమీద కునుకు కరువయ్యేది. ఎప్పుడు కరెంట్ అత్తుందో పోతదో తెల్వక తెల్లందాక చేతిలో గుత్ప పట్టుకని బాయికాడికి ఉరికేటోళ్లం. కానీ తెలంగాణ అచ్చినంక రైతుల బతుకులు మారినయ్. ఎవుసం పండుగలా మారింది. పుల్లుగా సాగునీరు, రోజంతా కరెంట్ వస్తుండడంతో రందీలేకుంట పంటలు సాగు చేసుకుంటున్నం. కానీ కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఇంతకంటే మంచిగ జేత్తనమని ఉత్త మాటలు మాట్లాడుతున్నరు. కానీ వారిని నమ్మబోం. పెంచిన చెట్టును నరుక్కోం. అయినా వాళ్ల పాలన వద్దు. వాళ్లు మాకు వద్దేవద్దు.

- బండారి గురువయ్య అంతర్గాం పోట్యాల

### 10 హెచ్‌పీ మోటర్లతో ఎవుసం కొసెల్తదా..?



కాంగ్రెస్‌ను రైతులు నమ్మడం లేదు. ఎందుకంటే ఎవుసం తెల్వని రేవంత్‌రెడ్డి ఎదేదో మాట్లాడుతన్నడు. 24 గంటల కరెంట్ తీసి మూడు గంటల కరెంట్ ఇత్తమంటున్నడు. పెద్ద మోటర్లు పెట్టుకొమ్మంటున్నడు. ఇట్లయితే ఇష్టమొచ్చిన హామీలిస్తూ రైతులను మభ్యపెడుతున్నడు. వారికి రైతులమే తగిన బుద్ధి చెపుతం. 3గంటల కరెంట్ ఇచ్చి, 10 హెచ్‌పీ మోటర్లు పెడతామంటే ఎవుసం కొసెల్తదా..? ఇప్పుడు ఈ సర్కారు ఇస్తున్న కరెంట్ విధానమే బాగున్నది. అక్కడక్కడ చిన్న ఇబ్బందులున్న రోజంతా కరెంట్ ఇత్తున్నరు. ఎప్పుడంటే అప్పుడు పొలం పారించుకుంటున్నం. పంటలు గూడా బాగా పండుతున్నయ్. నాలుగు పైసలు కండ్ల జూత్తున్నం.

-జక్కెనవేన సారంగపాణి. రైతు (కాల్వశ్రీరాంపూర్)



### ఉన్న కరెంట్ పీకి ఉత్తది జెత్తరు..

రైతుల బాధలు తెలిసిన ముఖ్యమంత్రి కేసీఆర్ సారు ఎవుసానికి 24 గంటల కరెంటిత్తున్నడు. ఎప్పుడు అక్కర పడితే అప్పుడు తడులు పెట్టుకుంటున్నం. నాకున్న రెండేకరాల పొలం నిండుగా పారుతున్నది. ఈ పదేండ్ల సంది బాధరబందీలేకుండ పంటలు పండిచుకుంటున్నం. కానీ ఇప్పుడు కాంగ్రెసోళ్లు ఎన్నికలు రాగానే ఊర్లళ్లకు అచ్చి రైతులకు ఇష్టమున్న కథలు చెబుతున్నరు. వాళ్ల అధ్యక్షుడు రేవంత్‌రెడ్డేమో మూడు సాగుకు మూడు గంటలు సాలని చెబుతుంటే. వీళ్లేమో 24 గంటల కరెంట్ ఇత్తమని ఉద్దెర మాటలు చెబుతున్నరు. మాకు వాళ్ల గురించి తెల్వదనుకుంటున్నరు. వాళ్లు వస్తే ఉన్న కరెంట్ పీకి ఉత్త కరెంట్ తెత్తరు. అయినా వాళ్లు వచ్చేది ఉన్నదా..? సచ్చేది ఉన్నదా? మేం మాత్రం మంచి జేసిన కేసీఆర్‌కే ఓటు గుద్దుతం.

- బూట్ల శంకరయ్య- ఎన్టీపీసీ మల్యాపూర్, రైతు (జ్యోతినగర్)

### అప్పటి రోజులద్దు..కాంగ్రెస్ పాలనద్దు

పంటలకు కాంగ్రెస్ మూడు గంటల కరెంట్ చాలంటే సరిపోతదా? ఒక్క ఎకరం కూడా సక్కగ పారదు. రైతుల బతుకులు ఆగం చేసేందుకే కాంగ్రెస్ కుట్రలు జేత్తున్నది. ఆపార్టీ అధికారంల ఉన్నప్పుడు కరెంట్ దొంగ రాత్రి ఎప్పుడస్తదో తెల్వక అక్కడే పడిగాపులు కాసేది. కోతల కరెంట్‌తో టైంకు సాగు నీరు అందక నెర్రెలు పడి పంటలు ఎండిపోయినయ్. మోటర్లు కాలిపోయి రిపేర్లు చేయించుకోడానికి ఇబ్బందులు పడినం. ఆనాడు లోవోల్టేజి సమస్యతో ఆగమాగమైనమ్. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే రైతులందరం తాలా కొంత వేసుకుని రిపేర్లు చేయించుకున్నమ్. అనాటి రోజులు ఎదురు కావద్దు. కాంగ్రెస్ పాలనవద్దు..

-అరికోళ్ల తిరుపతి, రైతు, బాలరాజ్‌పల్లి (జూలపల్లి)





### చెయ్యికి ఓటెయ్యం..కష్టాలు కొని తెచ్చుకోం

మాకు 12 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ ప్రభుత్వం ఇచ్చే నాణ్యమైన 24 గంటల కరెంట్‌తోనే సక్కగా ఎవుసం జేసుకుంటున్నం. ఏటా రెండు పసల్ల పంటలు పండిత్తున్నం. 5 గుంటల్లో కూరగాయలను పండిస్తున్నం. కానీ ఓట్లు రాంగానే కాంగ్రెసోళ్లు రైతులను ఆగం జేత్తున్నరు. మూడు గంటల ఫ్రీ కరెంట్ సాలని, పెద్ద మోటర్లు పెట్టుకొమ్మని ఉత్త మాటలు చెబుతున్నరు. సాగు గురించి అవగాహన లేకనే ఇష్టమచ్చినట్లు మాట్లాడుతున్నడు. వాళ్ల పాలన జేసినప్పుడు ఇచ్చిన కరెంట్ సంగతి మా కెరుకే. ఎన్ని బాధలు అనుభవించినమో కండ్లళ్ల తిరుగుతున్నయ్. అందుకే ఇప్పుడు చేతికి ఓటేయ్యం. మళ్లా కష్టాలు తెచ్చుకోం.

-కొమ్మిడి వినోద-రాజిరెడ్డి (రైతు, రాములపల్లి)

## ధరణి పోతే అరిగోసే

**పాత వ్యవస్థతో పరేషానే**

- మళ్లీ పైరవీలు, లంచాలు
- భూములకు భద్రత ఉండదు
- యజమానులు, కౌలుదారులకు గొడవలే
- కాంగ్రెస్ కుట్రలపై భగ్గుమంటున్న అన్నదాతలు
- ఆ పార్టీకి బుద్ధి చెబుతామని హెచ్చరిక

పెద్దపల్లి, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి తమ భూముల భద్రత కోసం తెచ్చిన ధరణిని తొలగిస్తామని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై జిల్లా రైతులు భగ్గుమంటున్నారు. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామన్న ఆ పార్టీని, తామే బంగాళాఖాతంలో వేస్తామని తేల్చిచెబుతున్నారు. ధరణితో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, భూములకు భద్రత పెరిగిందని, నిమిషాల్లో రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని చెబుతున్నారు. ఇది లేకుంటే ఇప్పుడు పెరిగిన భూముల ధరలను చూస్తే ఎన్ని మోసాలు, ఎన్ని గొడవలు జరిగేవోనని అంటున్నారు. ఒకప్పుడు తమ భూముల భద్రతపై అనేక అనుమానాలు ఉండేవని, ఇప్పుడు తమ భూములకు పూర్తి భద్రత ఏర్పడిందని చెబుతున్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకులు ఆగం చేస్తున్నారని మండిపడుతున్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థలను నెలకొల్పి భూరికార్డులు తారుమారు చేసే సంస్కృతి ఆ పార్టీదని, ఇప్పుడు అదే వ్యవస్థను తెచ్చే ప్రయత్నం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఆ నాయకులను నమ్మితే మొదటికే మోసం వస్తుందని, మళ్లీ పాత వ్యవస్థతో అరిగోస తప్పదని హెచ్చరిస్తున్నారు. లంచం లేనిదే ఒక్క పనీ కాదని, లేదంటే నెలల కొద్దీ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, పైసలిస్తే రికార్డులు మారుతాయని, కొత్త పేర్లు పుట్టకొస్తాయని నాటి రోజులను గుర్తు చేస్తున్నారు. పట్టా పాస్‌బుక్‌లో అనుభవదారు కాలం వస్తే గొడవలు మొదలవుతాయని, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ధరణి వ్యవస్థ కారణంగా ప్రతి పసలుకు రైతుబంధు కింద పెట్టుబడి సహాయం క్రమం తప్పకుండా సులువుగా పడుతున్నదని, ఇప్పుడు ఈ పద్ధతి మారిస్తే గతంలోలాగే అధికారులతో తిప్పలు తప్పవని వాపోతున్నారు. కాంగ్రెస్ అచ్చేది లేదు.. సచ్చేదు లేదు గానీ, పూటకోమాట చెబుతూ పరేషాన్ చేస్తున్నదని మండిపడుతున్నారు. ఆ పార్టీ అధికారంలోకి రాకుండానే అడ్డుకుంటామని, భూములకు రక్షణ కల్పించి, ఇబ్బందులు లేకుండా చేసిన కేసీఆర్‌ను మరోసారి సీఎంగా చేస్తామని స్పష్టం చేస్తున్నారు.



### మళ్లీ పీక్క తింటరా..?

మాది ధర్మారం. ధరణితోని రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు. ఎక్కడా భూముల పంచాయితీలు లేవు. కాంగ్రెస్ వస్తే ధరణి తీసేసి భూమాత తెస్తామంటున్నరు. మా భూమి మాకు చేయడానికి పైసల కోసం మళ్లీ పీక్క తింటరా? కాంగ్రెస్ వచ్చేది లేదు.. సచ్చేది లేదు. వట్టిగ రైతులను ఆగం పట్టిస్తున్నరు. ధరణి లేకముందు ఎంత గోసపడ్డమో అందరికీ తెలుసు. పాస్ బుక్కుల కోసం పట్టా కాగితాలు పట్టుకొని ఆఫీసర్ల సుట్టు ఏండ్లకేండ్లు తిరిగినోళ్లు చాలా మంది ఉన్న. ధరణి తీసేస్తే రైతులకు గోస మొదలైతది. ధరణి తీసేయమని ఏ రైతు అడుగుత లేడు. ధరణితోని కాంగ్రెసోళ్లకు వచ్చిన బాధేందో వాళ్లకే తెల్వాలె. ఉన్న ధరణి సాలు. కొత్తవి వద్దు. ధరణి తీసేస్తమంటే ఊకునేదిలేదు.

-వేల్పుల పర్వతాలు, రైతు- ధర్మారం (ధర్మారం మండలం)



### ధరణి ఎత్తేస్తే పంచాయితీలు మొదలైతయ్

ధరణి పోర్టల్ ఉంటే మా భూమి రికార్డుల్లో భద్రంగా ఉంటది. భూముల రిజిస్ట్రేషన్ అల్కగా అయితున్నది. ఆఫీసుల చుట్టు తిరిగే బాధలేదు. పైసా లంచం ఇవ్వాల్సిన పనిలేదు. కానీ కాంగ్రెసోళ్లేమో మేం రాగానే ఈ పోర్టల్‌ను బంగాళఖాతంల కలుపుతమంటున్నరు. ఏం తెలుసని అట్ల అంటున్నరు..? వాళ్ల కాలంలో భూముల రికార్డులు దారుణంగా ఉండేవి. ఒకరి పేరిట మరొకరి మీద పడి కౌలు రైతులు, పట్టాదారుల నడుమ భూముల పంచాయితీలు మొదలైతయ్. ఊర్లో లొల్లి ఐతది. పెద్ద మనుషుల కాడికి పంచాయతీకి పోవుడు షురైతది. జమనాత్ తీసుకుంటరు. అటు ఇటు ఖర్చులైతయ్. ఆఫీసుల సుట్టూ తిరిగి గోస పడుడే. ధరణి లేకపోతే రైతు బంధు ఎట్లిస్తరు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తె రైతులు మోసపోతరు. కేసీఆర్ సారు పెట్టిన ధరణి మంచిగున్నది. భూముల గురించి మాకే రంది లేదు.

-అందె శివప్రసాద్, రైతు, జూలపల్లి (జూలపల్లి)



### దళారుల రాజ్యమే అయితది

వ్యవసాయ కుటుంబం. ధరణి పోర్టల్ తీసేస్తే మళ్లీ దళారుల రాజ్యమే ఐతది. ఇప్పుడున్న పద్ధతితో మా భూములకు భద్రత ఉన్నది. మా ప్రమేయం లేకుండా ఇంకొకరి పేరు మీదకు మార్చే పరిస్థితి ఉండదు. అదే పాత పద్ధతి ఐతే కౌలుదారులు, హక్కు దారుల మధ్య చిచ్చులు మొదలైతయ్. భూమి రిజిస్ట్రేషన్‌కు కూడా ఇబ్బందులేమి ఉండట్లేదు. పాత పద్ధతి చూస్తే రెవెన్యూ ఆఫీసు కాడ దళారులదే రాజ్యం ఉండేది. రిజిస్ట్రేషన్ల కోసం దళారుల చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి కేసీఆర్ బయటపడేసిండు. నాడు రైతు భూమి అమ్ముకునేటప్పుడు, ఆ భూమి ఇంకొకరి పేరు మీద గూడ ఉండడం ఎన్నో బయటపడ్డయ్. అప్పుడు కొట్లాటలు, గొడవలు చాలా చూసినం. ఇప్పుడు ఆ బాధ లేదు. ధరణి తీసేస్తామంటే ఒప్పుకోం. ఈ కాంగ్రెసోళ్లు మంచిగున్న వాటిని చెడగొట్టడానికే వస్తున్నట్లు ఉన్నరు. వాళ్లకు పొరపాటున ఓటేస్తే బతుకులు ఆగమవుతయ్.

-సద్దినేని జితేందర్ రావు, లక్ష్మీపురం (రామగుండం 14వ డివిజన్)

### రేవంత్‌రెడ్డి మాటలు నమ్మితే ఆగమే



పూటకో మాట మాట్లాడే రేవంత్‌రెడ్డి మాటలు నమ్మితే ఆగమవుడే. అసలు గెలుస్తడో, గెలువడో ఆయనకే తెలియదు. ఇగ ధరణి ఎట్ల తీసేస్తడు. ధరణి రాక ముందు పహణీ కోసమే నెల రోజుల దాకా పట్వారీ చుట్టూ తిరిగిన. ఇప్పుడా పరిస్థితి లేదు. మీ సేవకు పోతే నిమిషాల్లో ప్రింట్ తీసి ఇస్తున్నరు. అప్పుడు భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లాల్సి వచ్చేది. పట్టా చేయాలని పట్వారీ చుట్టూ ఏడాది తిరిగిన ఎక్కించలేదు. లంచం ఇస్తేనే నాపేరు పహణీ, 1బీలో రాసిండు. ధరణి తీసేస్తే అలాంటి కష్టాలు మళ్లా మొదలైతయ్. పట్వారీ వ్యవస్థంటేనే వెన్నులో బుగులవుతున్నది. భూ రికార్డులో పేర్లు మాయమవుతయ్. పలుకుబడి ఉన్నోళ్లు పేర్లు ఎక్కించుకుంటరు. దొంగ సర్వే నంబర్లు పుట్టుకొస్తయ్. కేసీఆర్ సర్కారు తెచ్చిన ధరణి మంచిగానే ఉన్నది. ఇప్పుడు ఊళ్లల్లో భూమి పంచాయితీలు లేవు. ఈ పోర్టల్ తీసేస్తే గోస పడుతం. బడాయి మాటలు చెప్పే కాంగ్రెస్‌ను నమ్మవద్దు. 50 ఏండ్లు పాలించి ఎవరిని ఉద్దరించిండ్రు. కానీ కేసీఆర్ ప్రభుత్వం అందిరి కోసం పని చేస్తున్నది.

-అర్కుటి గట్టయ్య, రైతు, రాఘవపూర్( పెద్దపల్లి)



### దళారీ వ్యవస్థకు జీవం పోసినట్టే..

ధరణిని రద్దు చేస్తే దళారీ వ్యవస్థకు జీవం పోసినట్టే. కేసీఆర్ సీఎం కాక ముందు తాతలు, తండ్రు సంపాదించిన భూములు, ఇతరుల దగ్గర కొనుగోలు చేసిన భూములను మన పేరు మీద పట్టా చేయించుకోవాలంటే చాలా ఇబ్బందులుండేవి.ఆఫీసుల చుట్టూ తిరుగుతూ అధికారులను కలిసి బాధలు చెప్పుకునుడుకే సరిపోయేది. ఈ కాగితం లేదు, ఆ కాగితం లేదు అంటూ తిప్పేటోళ్లు. ఇన్ని ఇబ్బందులు పడ్డా, డబ్బులివ్వకుంటే పనులు జరిగేవి కాదు. ఇదంతా తిరగలేని రైతులు మధ్యల దళారులకు పైసలిచ్చి పనులు చేయించుకునేటోళ్లు. తెలంగాణ ప్రభుత్వం ధరణి పోర్టల్ తెచ్చాక ఆఫీసుల చుట్టూ తిరిగే బాధలు పూర్తి తప్పి పోయాయి. దళారీ అవసరం లేకుండా పోయింది. ఆన్‌లైన్‌లోనే స్లాట్ బుక్ చేసుకొని అందులో ఇచ్చిన రోజు కార్యాలయానికి వెళ్లి పట్టాలు చేసుకుంటున్నాం. అలాంటి ధరణి పోర్టల్‌ను రద్దు చేసి పాత వ్యవస్థను పునరుద్ధరిస్తామనడమంటే దళారీ వ్యవస్థను మళ్లీ పుట్టించినట్లే అయితది.

-రమేశ్, రైతు, బట్టుపల్లి(మంథని)

### ధరణి పోతే దళారుల రాజ్యమే



దళారుల రాజ్యం కోసం కాంగ్రెసోళ్లు ధరణి తీసేస్తమంటున్నరు. ఇప్పుడున్న ధరణితో మా భూములు భద్రంగ ఉంటున్నయ్. రైతు తన వేలి ముద్ర పెడితేనే ఇంకొకరి పేరు మీదకు మారుతది. అంతే తప్ప ఇంకొకరు అక్రమంగా తమ పేర్ల మీదకు మార్చుకునే వీలు లేదు. రిజిస్ట్రేషన్ గూడ సులువుగా పనైపోతున్నది. ఏ దళారి వద్దకు పోవాల్సిన పని లేదు. కాంగ్రెస్ భూమాత పోర్టల్ తెస్తే మళ్లీ పాత రోజులే ఇగ. ఆఫీసుల కాడ దళారులే ఉంటరు. కౌలుదారు, హక్కుదారుల మధ్య చిక్కులు, చిచ్చులు తప్పవు. కాంంగ్రెస్ పాలనలో ఒకే భూమి ఇద్దరు, ముగ్గురు పేర్ల మీద ఉండేది. నాదంటే నాదని భూముల కోసం కొట్టుకున్న రోజులు చూసినం. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణితో భూమి పంచాయితీలు లేవు. ధరణి ఉంటేనే రైతులకు భద్రం.

-అర్శనపల్లి శ్రీకాంత్, యువ రైతు, లింగాపూర్ (అంతర్గాం)